క్లుప్తంగా

కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలు అమలుచేయాలి



చింతపల్లి మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

చింతపల్లి: ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చిందని వాటిని తక్షణమే అమలుచేయాలి సీపీఎం మండల కార్యదర్శి పాంగి ధనుంజై అన్నారు. పార్టీ పిలుపుమేరకు సోమవారం చింతపల్లిలో గిరిజనులతో కలసి ఆందోళన చేపట్టారు. మండల పరిషత్ కార్యాలయం ఎదుట బైటాయించి కొద్దిసేపు ఆందోళన చేశారు. నాయకుడు చిరంజీవిపడాల్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌దారులను ఇబ్బందులకు గురిచేయడం తగదు



రేషన్‌దారులతో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మారావు

ముంచంగిపుట్టు: రేషన్ లబ్ధిదారులను ఈకేవైసీ పేరుతో ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేయడం తగదని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు అన్నారు. మండలంలోని జర్జుల, కర్రిముఖిపుట్టు పంచాయతీల్లో ఈకేవైసీతో రేషన్‌దారులు అవస్థలను చూసి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పద్మారావు మాట్లాడుతూ లబ్ధిదారులు ఈకేవైసీ ఈ నెల 31వ తేదిలోగా చేసుకోవాలని, లేని పక్షంలో రేషన్ సరుకులు నిలిచిపోతాయని హెచ్చరించడంతో రేషన్‌దారులు పడరాని పాట్లు పడుతున్నారన్నారు. ఈకేవైసీ గడువుకు వెసులుబాటు ఇవ్వాలని, అప్పటి వరకు రేషన్ సరఫరా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

సమస్యలపై వినతుల స్వీకరణ



డుంబ్రిగుడలోని వినతులను స్వీకరిస్తున్న అధికారులు

డుంబ్రిగుడ: మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో ఆర్‌వోఆర్ పట్టాదారు పాస్ పుస్తకాల కోసం దాదాపు 10 మంది దరఖాస్తు చేసుకున్నట్టు ఎంపీడీవో ప్రేమ్‌సాగర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొద్ది నెలలుగా అన్ని వర్గాలకు పింఛన్లు విడుదల కావడ లేదన్నారు. రోడ్లు, కల్వర్టుల నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతుందని, తాగునీటి సమస్య అధికంగా ఉందని, మరమ్మతు పనులకు కావాల్సిన మెటీరియల్ చేరగానే పనులు చేపడతామన్నారు. ఇన్‌చార్జి తహసీల్దార్ ముజీబ్ పాల్గొన్నారు.

ఆలయం భూఆక్రమణపై ఫిర్యాదు



తహసీల్దార్ నర్సమ్మకు ఫిర్యాదు చేస్తున్న స్థానికులు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో రామాలయం చుట్టూ ఉన్న భూమి అక్రమణకు గురవుతుందని స్థానికులు సోమవారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్‌లో తహసీల్దార్ నర్సమ్మకు ఫిర్యాదు చేశారు. రామాలయం నిర్మాణ సమయంలో 25సెంట్లు భూమిని కేటాయించడం జరిగిందని, ప్రస్తుతం ఆలయం చుట్టూ నిర్మాణాల వల్ల భూమి అక్రమణకు గురైందని, అక్రమణ దారులపై చర్యలు తీసుకొని, ఆలయం భూమిని పరిరక్షించాలని స్థానికులు కోరారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ నర్సమ్మ మాట్లాడుతూ రామాలయానికి కేటాయించిన భూమిపై సర్వే చేసి, హద్దులు కేటాయిస్తామన్నారు. అక్రమణ చేసిన వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈవోపీఆర్‌డీవో చిన్నాన్న, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాడేరు రూరల్: కొయ్యూరు మండలం కాకరపాడు 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో పెయింటింగ్, విద్యుత్ నిర్వహణ పనుల నిమిత్తం మంగళవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు పాడేరు ఈపీడీసీఎల్ ఈఈ ఎ.వి.ఎస్.ఎం.అప్పారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సబ్ స్టేషన్ పరిధిలోని కొయ్యూరు, కాకరపాడు, సింగవరం, రాజేంద్రపాలెం, దొడ్డవరం, మర్ధవడ, గుడ్లపల్లి, బూదరాళ్లు, లూస, మంప, రేవళ్ల, తుమ్మలబంధ గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.



ముంచంగిపుట్టులో టీబీ వ్యాధిపై అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్యులు,సిబ్బంది, విద్యార్థులు



చింతపల్లి ప్రాంతీయ ఆస్పత్రి వద్ద వైద్యాధికారులతో కలిసి ర్యాలీలో పాల్గొన్న ఏడీఎంహెచ్‌ఓ ప్రతాప్



అడ్డతీగలలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

అవగాహనతోనే క్షయ నియంత్రణ సాధ్యం



కొయ్యూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

- ఘనంగా జాతీయ క్షయ వ్యాధి దినోత్సవం
- వాడవాడలా అవగాహన ర్యాలీలు



సీలేరులో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది



రాజవొమ్మంగిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది



కూనవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ముంచంగిపుట్టు: జాతీయ క్షయ వ్యాధి దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు, అధికారులు మాట్లాడుతూ క్షయ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని, అవగాహనతోనే వ్యాధి నియంత్రణ సాధ్యమన్నారు. టీబీని ఓడించాలన్నారు. వ్యాధిపై గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. టీబీ లక్షణాలను ముందస్తుగా గుర్తిస్తే చాలా వరకు ఆ వ్యాధి సోకకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చన్నారు. ప్రధానంగా క్షయ వ్యాధి మైక్రో బ్యాక్టీరియా ద్వారా వ్యాపిస్తుందన్నారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం ఉంటే, బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆస్పత్రికి వెళ్లి కఫం పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ అయినప్పటికీ ఆందోళన వద్దన్నారు. సకాలంలో మెరుగైన చికిత్స పొందితే వ్యాధి పూర్తిగా తగ్గిపోతుందన్నారు. ముంచంగిపుట్టు మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో సీహెచ్‌సీ వైద్యాధికారి కె.గీతాంజలి , వైద్యాధికారులు రమేష్, శిరీష, శ్యాం ప్రసాద్, ఆరోగ్య విస్తరణ అధికారి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: మండల కేంద్రంలోని జరిగిన కార్యక్రమంలో పాడేరు ఏడీఎంహెచ్‌వో ప్రతాప్, చింతపల్లి ప్రాంతీయ ఆస్పత్రి సూపరింటెండెంట్ ఇందిరప్రియాంక, వైద్యాధికారులు చంద్రశేఖరరావు, ఎన్‌సీడీసీ నోడల్ అధికారి భూపతిరాజు, క్షయ విభాగం పర్యవేక్షకులు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు: మండలంలోని జరిగిన కార్యక్రమంలో రాజేంద్రపాలెం పీహెచ్‌సీ వైద్యుడు సంపత్‌బాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీలేరు: సీలేరులో జరిగిన కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ మస్తాన్‌వల్లీ, కె.సౌమ్య, హెల్త్ సూపర్‌వైజర్ త్రినాథ్, ఎం.బాలామణి, బి.దేవికుమారి ఆశా కార్యకర్తలు కరుణామని తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగల: మండలంలో జరిగిన కార్యక్రమాల్లో స్థానిక సీహెచ్‌సీ సూపరింటెండెంట్ పండా సతీష్, ఎల్లవరం పీహెచ్‌సీ వైద్యాధికారి నాగప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మండలంలో జరిగిన కార్యక్రమాల్లో రాజవొమ్మంగి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుష్మా, సీహెచ్‌వో పద్మావతి, హెచ్‌ఎస్ సుధాకర్, హెచ్వీలు లక్ష్మమ్మ, రమాబాయి, ఎంఎల్‌హెచ్‌పీ, సీహెచ్‌ఓలు, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

కూనవరం: మండలంలో జరిగిన కార్యక్రమాల్లో హెల్త్ సూపర్‌వైజర్ డి.శ్రీనివాస్‌రావు , హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు, అశాలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

600 లీటర్ల పులుపు ధ్వంసం



బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న ఎస్‌ఐ వెంకటేష్, సిబ్బంది

గంగవరం: మండలంలోని లక్కొండ గ్రామ శివారు అటవీ ప్రాంతంలో సారా బట్టీపై దాడులు నిర్వహించినట్టు ఎస్‌ఐ బి.వెంకటేశ్ తెలిపారు. లక్కొండ అటవీ ప్రాంతంలో సారా బట్టీలు నిర్వహిస్తూ సారా రవాణా చేస్తున్నట్టు అందిన సమాచారం మేరకు సోమవారం సాయంత్రం సిబ్బందితో దాడులు నిర్వహించినట్టు చెప్పారు. ఈ దాడిలో 600లీటర్ల బెల్లపు ఊటను, సారా తయారీకి ఉపయోగించే సామగ్రిని ధ్వంసం చేసినట్టు ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు. సారా తయారుచేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. సిబ్బంది పాల్గొన్నారు.

27న మండల సమావేశం

పాడేరు రూరల్(జిమాడుగుల): మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 27న ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్టు ప్రిసైడింగ్ అధికారి విద్యాసాగర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ పదవీ ఖాళీ కావడంతో కో-అప్షన్ మెంబర్, ఎంపీటీసీ సభ్యులతో గురువారం ఉదయం 11 గంటలకు ప్రత్యేక సమావేశం జరుగుతుందని సభ్యులందరూ విధిగా హాజరుకావాలని కోరారు.

ఘనంగా అమ్మవార్ల జాతర మహోత్సవాలు



జి.మాడుగులలో ఘటాలతో భక్తుల ఊరేగింపు



బందంవారిపాకలులో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

జి.మాడుగుల(పాడేరు రూరల్): చౌడుపల్లి పంచాయతీ పసువులబంధలో కొప్పులమ్మ జాతర వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా జి.మాడుగులకు చెందిన భక్తులు లమ్మసింగి రమణమూర్తి, అనిత దంపతుల ఆధ్వర్యంలో ఘటాలతో పాటు పసుపు కుంకుమ, నూతన పట్టువస్త్రాలతో ఊరేగించి, అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. కొప్పులమ్మ జాతర ఉత్సవాలను నాలుగు రోజుల పాటు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. అప్పలరాజు, గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగల: మండలంలోని బందంవారిపాకలులో వెలసిన బోడ కొండమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వేడుకల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఏటా ఉగాది పర్వదినానికి ముందు నుంచి అమ్మవారి జాతర నిర్వహించి అనంతరం ఉగాది రోజు అన్నదాన సమారాధన నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

జాతర నిర్వహణపై ప్రత్యేక సమావేశం నేడు



గంగమ్మతల్లి గుడి వద్ద గ్రామస్తులకు ఆహ్వానం పలుకుతున్న జెడ్పీటీసీ జానకమ్మ

డుంబ్రిగుడ: మండలంలోని అరకు గ్రామంలో గంగమ్మతల్లి జాతర మహోత్సవం ఏర్పాట్లుపై గ్రామ పెద్దలతో మంగళవారం చర్చించనున్నట్టు అరకు పంచాయతీ సర్పంచ్ జి.శారద, జెడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ తెలిపారు. ఈ సందర్భంగా వారు సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఏటా గంగమ్మ తల్లి జాతరను అరకు పంచాయతీ కేంద్రంలో ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది కూడా ఉత్సవం వైభవంగా జరిపేందుకు ఏర్పాట్లు, తేదీ ఖరారు తదితర విషయాలను గ్రామ పెద్దలతో చర్చించనున్నట్టు చెప్పారు. ఈ మేరకు అమ్మవారికి పసుపుకుంకుమలు సమర్పించి, అనంతరం భక్తులకు భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించినట్టు తెలిపారు. గ్రామ పెద్దలు కృష్ణారావు, మంగయ్య, మొద్దు, బుద్దు, ఆలయ అర్చకుడు గురునాయుడు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ చొరవ-స్వచ్ఛంద సంస్థ ఔదార్యం



మరమ్మతులు చేపట్టిన అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో సర్పంచ్, సంస్థ ప్రతినిధులు

చింతూరు: శిథిలమైన అంగన్‌వాడీ భవనం సమస్యను స్థానిక సర్పంచ్ లేఖ ద్వారా ఓ స్వచ్ఛంద సంస్థ దృష్టికి తీసుకెళ్లడంతో సదరు సంస్థ ఆ భవనానికి మరమ్మతులు చేపట్టి ఔదార్యాన్ని చాటుకుంది. మండలంలోని పేగ పంచాయతీలోని అల్లిగూడెం అంగన్‌వాడీ కేంద్రం మరమ్మతులకు గురై శిథిలావస్థకు చేరుకుంది. దీంతో స్థానిక సర్పంచ్ పాయం చంద్రయ్య చొరవ చూపి భవనానికి మరమ్మతులు చేపట్టాలని సమారిటన్ ఫర్ ది నేషన్ సంస్థ డైరెక్టర్‌కు లేఖ రాశారు. దీనిపై స్పందించిన సంస్థ ప్రతినిధులు రూ.2లక్షల వ్యయంతో భవనానికి మరమ్మతులు చేపట్టి గురువారం భవనాన్ని పునఃప్రారంభించారు. తమ చిన్నారుల కష్టాలను తీర్చిన సంస్థకు సర్పంచ్ చంద్రయ్యతో పాటు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ రామకృష్ణ, సంస్థ డైరెక్టర్ రామ్‌కుమార్, సూపర్‌వైజర్ సత్యవతి, గ్రామపెద్దలు లక్ష్మణ్, సీతయ్య, వెంకటేష్, పాదయ్య పాల్గొన్నారు.

ఆదివాసీ గ్రామాల అభివృద్ధిలో ప్రభుత్వ నిర్లక్ష్యం తగదు



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న గిరిజనులు

- ఇళ్ల నిర్మాణ వ్యయాన్ని రూ.5లక్షలకు పెంచాలని డిమాండ్
- ఆర్వీనగర్ పాలగెడ్డ రహదారికి తక్షణమే మరమ్మతు చేయాలని డిమాండ్
- గూడెంకొత్తవీధిలో సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాకు పోటెత్తిన గిరిజనులు

గూడెంకొత్తవీధి: గిరిజన గ్రామాల్లో సమస్యల పరిష్కారం విషయంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వహిస్తోందని సీపీఎం మండల కార్యదర్శి, గాలికొండ ఎంపీటీసీ సభ్యుడు అంపురంగి బుజ్జిబాబు అన్నారు. సీపీఎం పిలుపు మేరకు ప్రజాచైతన్య యాత్రలో భాగంగా సోమవారం మండల కేంద్రంలో గిరిజనులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం జరిగింది. చైతన్య స్రవంతి కూడలి నుంచి మండల కేంద్రం వరకూ గిరిజనులంతా పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం తహసీల్దారు కార్యాలయం ఎదుట కొద్దిసేపు బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గిరిజనుల ఇళ్ల నిర్మాణానికి రూ.5లక్షల సాయాన్ని ఇవ్వాలని గిరిజన గ్రామాల్లో తాగు, సాగునీటి సదుపాయాలు కల్పించాలని ప్రధానంగా ఆర్వీనగర్ నుంచి పాలగెడ్డ వరకూ ప్రధాన రహదారికి మరమ్మతులు చేపట్టాలని కోరారు.

అనంతరం అధికారులకు వినతి పత్రాలను సమర్పించారు. నాయకులు కోటేశ్వరరావు, చంటిబాబు, బాలయ్య, పరమేశ్వరరావు, జగన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎంపీడీవో ప్రేమ్‌సాగర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

డుంబ్రిగుడ: ప్రజా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు మండల కేంద్రంలోని జాతీయ రహదారి నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు సోమవారం భారీ ర్యాలీ చేపట్టారు. గిరిజన ప్రాంతాల్లో ప్రజా సమస్యలు గుర్తించి పరిష్కరించేందుకు పార్టీ నాయకులు ప్రజా చైతన్య యాత్రను ఈనెల 8 నుంచి చేపడుతున్నారు. ఈ సందర్భంగా సీపీఎం మండల ప్రధాన కార్యదర్శి ఎస్.బి.పోతురాజు మాట్లాడుతూ గ్రామాల్లో రహదారులు, తాగునీరు, డ్రైనేజీలు తదితర సమస్యలతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారన్నారన్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి ఆయా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలో నెలకొన్న పలు సమస్యలపై ఎంపీడీవో ప్రేమ్‌సాగర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందంచి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. యకులు సురేష్ కుమార్, సూర్యనారాయణ, దొంబు గిరిజనులు పాల్గొన్నారు.

నేటి నుంచి అమ్మవారి ఉత్సవాలు



బాపనమ్మ తల్లి విగ్రహం

రంపచోడవరం: రంపచోడవరం సమీపంలోని సీతపల్లి గడి బాపన్నమ్మ జాతర ఉత్సవాలు మంగళవారం నుంచి ఐదు రోజులు పాటు ఘనంగా నిర్వహిస్తున్నట్టు ఆలయ ఈఓ. రమేష్ తెలిపారు. ప్రతి రోజు ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరుగుతాయని పేర్కొన్నారు. గరగ నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసినట్టు పేర్కొన్నారు.

పరదేశమ్మ తల్లి పండగ నేడు

మునగపాక: మునగపాకలో మంగళవారం పరదేశమ్మతల్లి పండగను ఘనంగా నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ వేగి కృష్ణ తెలిపారు. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశామన్నారు. రాత్రికి సంతబయిల తంపరమూల సంఘం విశాలాంధ్ర స్టేజిపై అద్దంలో చందమామ సాంఘిక నాటక ప్రదర్శన ఉంటుందన్నారు. మందబయిల కొత్త మహాలక్ష్మమ్మ పురిటిగెడ్డ సంఘం ఆధ్వర్యంలో రైతు పోరాటం నాటక ప్రదర్శన కూడా జరుగుతుందన్నారు. పండగను ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని ఆయన కోరారు.

టీబీ నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఐటీడీఏ పీవో సింహాచలం

రంపచోడవరం: టీబీ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం చెప్పారు. ప్రపంచ టీబీ దినోత్సవం సందర్భంగా ఐటీడీఏ కార్యాలయం ఆవరణలో సోమవారం ఆరోగ్యశాఖ నిర్వహించిన ర్యాలీని పీవో సింహాచలం, సబ్ కలెక్టర్ కె.ఆర్.కల్పశ్రీలు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా పీవో సింహాచలం మాట్లాడుతూ టీబీ లక్షణాలు ఉన్న వారు దగ్గరలోని ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలన్నారు. క్షయ బాధితులకు ఎవరైన సహాయం చేయవచ్చన్నారు. టీబీ రోగులకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేస్తుందన్నారు. ఐటీడీఏ కార్యాలయం నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఎస్‌డీసీ అంబేడ్కర్, ఏడీఎంఅండ్‌హెచ్‌వో జి.శిరిష, ఆర్‌ఎం ఇందిరా, వైద్యులు అపూర్వ తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు రహదారికి మోక్షం

- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన రూ.కోటి నిధులు
- శరవేగంగా రాజవొమ్మంగి నుంచి అప్పలరాజుపేట రోడ్డు పనులు
- ఆనందంలో గ్రామస్తులు



రాజవొమ్మంగి నుంచి అప్పలరాజుపేటకు వరకు రహదారి నిర్మాణ పనులు

రాజవొమ్మంగి: మండలకేంద్రం రాజవొమ్మంగి నుంచి రెండు కిలోమీటర్ల దూరం గల రహదారికి ఎట్టకేలకు మోక్షం లభించింది. గిరిజన సంక్షేమ ఈఈ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం బీటీ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. బీటీ రెండో లేయర్ వేయాల్సి ఉన్నట్టు ఆయన తెలిపారు. ఈ రహదారికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కోటి రూపాయల నిధులు మంజూరయ్యాయి. ఎన్నికల కోడ్‌తో పనులు నిలిచిపోయాయి. ఎట్టకేలకు పనులు ప్రారంభమవడంతో అప్పలరాజుపేట గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారికి చెందిన రెండు చోట్ల 200 మీటర్ల పొడవున సీసీ రోడ్డును కూడా నిర్మిస్తున్నట్టు ఈఈ శ్రీనివాసరావు తెలిపారు. పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. సచివాలయం కార్యదర్శి సంధ్యారాణి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ నాని, గిరిజన సంక్షేమశాఖ వర్క్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ పనులు పర్యవేక్షించారు.

గంజాయి, సారా అనర్థాలపై అవగాహన



వై.రామవరం వారపు సంతలో ప్రజలకు అవగాహన కల్పిసున్న, సీఐ నరసింహమూర్తి

వై.రామవరం: మండల కేంద్రంలోని కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న అడ్డతీగల సీఐ బి.నరసింహమూర్తి, వై.రామవరం ఎస్‌ఐ బి.రామకృష్ణ స్థానికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ యువత వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి, సారా ఇతర మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దన్నారు. గంజాయి, సారా రవాణా చట్టరీత్యా నేరమని వాటికి దూరంగా ఉండాలన్నారు. యువత బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అసాంఘిక కార్యకలాపాల జోలికి వెళ్లొద్దని సూచించారు. ఏ సమస్య ఉన్నా నేరుగా తమకు తెలియజేస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. గిరిజన గ్రామాల అభివృద్ధికి పోలీసు శాఖ పలు కార్యక్రమాలు చేపడుతుందన్నారు. గిరిజన యువతకు ఉపాధి కల్పిస్తోందన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి ప్రణాళిక రూపొందించినట్టు చెప్పారు. గిరిజన యువతకు ఉచితంగా డ్రైవింగ్ లైసెన్స్‌లు అందజేశామన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నేరాలు అరికట్టేందుకు పోలీసు శాఖకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ట్రైనీ ఎస్‌ఐలకు ఇక్కడి పరిస్థితులు, విధుల నిర్వహణపై పూర్తి అవగాహన కల్పించారు. ట్రైనీ ఎస్‌ఐలు సురేష్, చక్రధర్, మహతి, చందన, గౌరీ, ఈశ్వరి, లోకేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్‌దారులకు తప్పని తిప్పలు

- ఈకేవైసీ కోసం ఆధార్ కేంద్రానికి లబ్ధిదారుల పరుగులు
- కూటమి ప్రభుత్వం నిర్ణయంపై ఆగ్రహం



ముంచంగిపుట్టు ఆధార్ కేంద్రం వద్ద తరలివచ్చిన రేషన్‌దారులు

ముంచంగిపుట్టు: రేషన్‌కార్డుకు ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలని ప్రభుత్వం, పౌర సరఫరాల అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఆధార్ కార్డును అప్‌డేట్ చేసుకోవాలని రేషన్‌దారుల కుటుంబసభ్యులంతా ఆధార్ కేంద్రానికి పరుగులు పెడుతున్నారు. రేషన్ డిపోల్లో ఆధార్ అప్‌డేట్ చేసుకొనే అవకాశం కల్పించిన, అక్కడ సక్రమంగా జరగకపోవడంతో రేషన్‌దారులకు ఆధార్ కేంద్రం దిక్కుగా మారింది. సోమవారం ముంచంగిపుట్టు మండల కేంద్రంలో ఉన్న ఆధార్ కేంద్రం వద్దకు 23 పంచాయతీల నుంచి గిరిజనులు అధిక సంఖ్యల్లో వచ్చారు. ఒకే ఒక ఆధార్ కేంద్రం ఉండడంతో ఉదయం నుంచి సాయంత్రం నిరీక్షించారు. ఎండ తీవ్రతలో అవస్థలు పడుతూ పిల్లలతో తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భారీ సంఖ్యల్లో ప్రజలు రావడంతో సాయంత్రం వరకు కొంత మందికి మాత్రమే ఆధార్ అప్‌డేట్ జరిగింది. మరికొంత మందికి జరగకపోవడంతో తీవ్ర నిరాశతో ఇంటి బాట పట్టారు.

ఈ నెల 31వ తేదీలోగా రేషన్ కార్డుకు ఈకేవైసీ చేసుకోవాలని, లేని పక్షంలో రేషన్ నిలిచిపోతుందని అధికారులు తెలియజేయడంతో రేషన్‌కార్డుదారులు ఆందోళన చెందుతున్నారు. తాము పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని, ఈకేవైసీకి గడువు పెంచాలని, ఆధార్ కేంద్రాలు పంచాయతీ స్థాయిలో ఏర్పాటు చేయాలని రేషన్‌దారులు కోరుతున్నారు.